

అందుబాటులో ఇసుక
కలెక్టర్ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఇసుక లేకపోవడంతో ఇతర ప్రాంతాల్లో ఇసుకను అందుబాటులో ఉంచామని జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. తూర్పుగోదావరి, బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలలోని స్టాక్ పాయింట్లు వద్ద ఇసుకను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. పెరవలి మండలం ఉసులుమర్రులో 12,545 మెట్రిక్ టన్నులు, పెండ్యాలలో 1,19,150 మెట్రిక్ టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రులో 42,208 మెట్రిక్ టన్నులు, రావులపాలెం మండలం రావులపాడు-1లో 3,798 మెట్రిక్ టన్నులు, రావులపాడు-2లో 1,700 మెట్రిక్ టన్నులు ఇసుక శనివారం నాటికి అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

500 బడుల్లో.. పదిలోపే విద్యార్థులు..!



ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిన గత పాలకులు
117 జిఒ రద్దు చేయకుండా కూటమి ప్రభుత్వం ముందుకు
ఎన్నికల్లో ఇచ్చిన హామీకి తిలోదకాలిచ్చిన సర్కార్
గత ప్రభుత్వ జిఒ ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటుపై విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నూతన విద్యావిధానం ముసుగులో ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన 117 జిఒతో ప్రాథమిక విద్య ప్రశ్నార్థకంగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 500 ప్రాథమిక పాఠశాలల్లో పదిలోపు విద్యార్థులే ఉన్నారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ పాఠశాలలను కొనసాగిస్తారా.. లేక మూసేస్తారా అనే ఆందోళన సర్వత్రా నెలకొంది. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిన 117 జిఒను రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకొచ్చిన కూటమి సర్కార్ అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోంది. ఏలూరు జిల్లాలోని 27 మండలాల పరిధిలో 1400 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 281 ప్రాథమిక పాఠశాలల్లో పది మందిలోపు విద్యార్థులే ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన బుట్టాయగూడెం మండలంలో 42 స్కూళ్లలో పదిలోపు విద్యార్థులు ఉండటం గమనార్హం. చాలా మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. చాలా స్కూళ్లలో ఆరేడుగురు విద్యార్థులున్న పరిస్థితి ఉంది. ముఖ్యంగా ఏజెన్సీలో ప్రాథమిక విద్య మరింత దెబ్బతింది. పశ్చిమగోదావరి జిల్లాలో 20 మండలాల పరిధిలో 959 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 219 బడుల్లో పదిలోపే విద్యార్థులు ఉన్నారు. పోడూరు మండలంలో 18, భీమవరం మండలంలో 16 స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పదిలోపే ఉన్నారు. ఈ స్కూళ్లను మూసేస్తే ప్రాథమిక విద్య పూర్తిగా నిర్వీర్యమైపోనుంది. కేంద్రంలోని మోడీ సర్కార్ తెచ్చిన నూతన విద్యావిధానాన్ని గత వైసిపి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అందులో భాగంగా 117 జిఒను తీసుకొచ్చింది. 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేసింది. దీంతో ప్రాథమిక స్కూళ్లలో ఒకటి, రెండు తరగతులు మాత్రమే మిగిలాయి. ప్రాథమిక స్కూళ్లలో అంగన్‌వాడీ (ప్రీ ప్రైమరీ-1, 2) పిల్లలను చేర్చుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఎక్కడా జరగలేదు. దీంతో ఒకటి, రెండు తరగతులు మాత్రమే ఉండటంతో చాలా స్కూళ్లలో పదిలోపే విద్యార్థులు ఉన్నారు. 3, 4, 5 తరగతులను దూరంగా ఉన్న హైస్కూళ్లలో విలీనం చేయడంతో చిన్న పిల్లలను అంతదూరం ఒంటరిగా పంపించలేక ఇంటి వద్దకు బస్సు వచ్చే ప్రయివేటు స్కూళ్లలో తల్లిదండ్రులు చేర్పిన పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన పాలకులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం కారణంగానే ఇటువంటి పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం నాడు-నేడు పేరుతో స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పినా ప్రభుత్వ విద్య బలోపేతానికి మాత్రం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో ప్రాథమిక విద్య అస్తవ్యస్తమైంది.

మూతపడకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలంటే ముందుగా 117 జిఒను రద్దు చేయాలి. ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే 117 జిఒ రద్దు చేస్తామని టిడిపి కూటమి హామీ ఇచ్చింది. జిఒను రద్దు చేయకుండా ఉపాధ్యాయుల సర్దుబాటుకు ప్రభుత్వం పూనుకుంది. జిఒ కారణంగా గతంలో 40 మంది విద్యార్థులకు ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా, ఆ సంఖ్య 60కి పెంచింది. దీంతో ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారని డివిజన్ పరిధిలోని ఇతర స్కూళ్లకు బదిలీ చేస్తున్నారు. జిఒ 117 రద్దు చేస్తే ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులు సరిపోరు. మరికొంత మందిని నియమించాల్సి ఉంటుంది. అంతేకాకుండా 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు పంపించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల కొరత ఉంటే డిఎస్‌సి పూర్తయ్యే వరకూ తాత్కాలికంగా విద్యా వాలంటీర్లను నియమించి ముందుకు సాగాలి. జిఒను రద్దు చేసి ముందుకు సాగితే ప్రాథమిక విద్యతోపాటు హైస్కూల్ విద్య సైతం బలోపేతమవుతుంది. ప్రభుత్వం ఆ విధంగా ఆలోచించకుండా 117 జిఒ ఆధారంగానే ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టింది. దీని వల్ల ప్రభుత్వ విద్య బలోపేతానికి ఎటువంటి ప్రయోజనమూ ఉండదని చర్చ ఉపాధ్యాయ సంఘాల్లో నడుస్తోంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేవిధంగా చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి
మంత్రి నిమ్మలకు సిపిఎం నేతల వినతి


సమస్యలపై మంత్రి రామానాయుడుతో చర్చిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉమ్మడి జిల్లాలో పలు సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వీటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని సిపిఎం నేతలు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఇతర నేతలతో కూడిన బృందం శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రైతులకు ధాన్యం బకాయిల సొమ్ము వెంటనే వడ్డీతో సహా చెల్లించాలని కోరారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా వ్యవసాయానికి మీటర్లు పెట్టే ఆలోచన ఉపసంహరించుకోవాలని కోరారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులిచ్చి రుణాలు అందించాలని, భూయజమానితో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులిచ్చేలా చట్టాన్ని సవరించాలని, వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. వరదలు, వర్షాల రీత్యా మురుగు కాలువలు, డ్రెయిన్లలో యుద్ధప్రాతిపదికన చెత్త, చెదారం, తూడు తొలగించి బాగు చేయించాలని విజ్ఞప్తి చేశారు. నివాస ప్రాంతాల్లో, కాలనీల్లో ముంపు, మురుగు లేకుండా చూడాలని, వ్యాధులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జ్వరాలతో సహా అన్నివ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రహదారులపై టోల్‌ట్యాక్స్ ఆలోచన విరమించుకోవాలని, రోడ్ల మరమ్మతులు చేయించి ప్రమాదాలు నివారించాలని కోరారు. చించినాడలో గోదావరి లంక భూములకు పేదలకు పట్టాలు ఇవ్వాలని, గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, తుందుర్రు ఉద్యమ అక్రమ కేసులు కూడా ఎత్తివేయాలని కోరారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలు ఆంధ్రా సుగర్స్, డెల్టా పేపర్ మిల్స్, తణుకులో స్పిన్నింగ్ మిల్స్, ఏలూరులో జ్యూట్‌మిల్లులు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని, వ్యవసాయ, గ్యాస్ ఆధార పరిశ్రమలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో దళితుల శ్మశానవాటిక సమస్యలు పరిష్కరించాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, స్కీమ్ వర్కర్లు, వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లాలో కొల్లేరు నిర్వాసితులకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, కలుషిత కారణంగా వ్యాధులు విజృంభిస్తున్నాయని, జిల్లాలోని ఆసుపత్రుల్లో అవసరమైన సిబ్బంది నియామకంతోపాటు పరికరాలు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇళ్ల కాలనీలు, టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలని, లబ్ధిదారులకు ఇళ్లు స్వాధీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారులు అప్పుల పాలుకాకుండా ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సూచించారు. కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని, ప్రభుత్వ నిబంధనలు అమలయ్యేలా చూడాలని కోరారు. నిత్యావసర ధరల అదుపునకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో సరుకులు పెంచాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, నేతలు జెఎన్‌వి.గోపాలన్, కవురు పెద్దిరాజు, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, జుత్తిగ నరసింహమూర్తి, వై.నాగేంద్రరావు, వై.సాయికిరణ్, ఎం.జీవరత్నం, జవ్వాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి నిధుల కొరత లేదు
రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు


రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - యలమంచిలి


గత వైసిపి ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిన కారణంగా నిధుల కొరత ఉన్నప్పటికీ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఎటువంటి లోటు లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం యలమంచిలి మండలం గంగడపాలెం గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన, రూ.12 లక్షలతో ఫుట్‌పాత్ బ్రిడ్జి ప్రారంభోత్సవం, మట్లపాలెం గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన, ఉన్నత పాఠశాలలో మీటింగు హాలుకు రూ.20 లక్షలతో శంకుస్థాపన, నార్ని మెరక గ్రామంలో సీసీ రోడ్డుకు రూ.10 లక్షలతో శంకుస్థాపన, వడ్డీలంక గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన పనులకు మంత్రి నిమ్మల రామానాయుడు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ జగన్ అయిదేళ్ల రాక్షస పాలన పోయిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో రూ.14 లక్షల కోట్లు అప్పులు తెచ్చి, పక్కదారి మళ్లించి, ఖజానా ఖాళీ చేసిందన్నారు. టిడిపి, బిజెపి, జనసేన ప్రజా ప్రభుత్వానికి ప్రజలు అవకాశం ఇచ్చారని మంత్రి తెలిపారు. శనివారం నాలుగు గ్రామాల్లో ఆరు పనులకు రూ.72 లక్షలతో శ్రీకారం చుట్టామన్నారు. తెలుగు జాతికి భవిషత్తు, భావితరాల వారికి మంచి భవిష్యత్తు అందిస్తామని మంత్రి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛను ఒకేసారి పెంచి, మూడు నెలల ఏరియర్సు కలిపి రూ.7 వేలు ఇంటికి వచ్చి అందజేశామన్నారు. గత ప్రభుత్వం వెయ్యి రూపాయిలు పెంచడానికి అయిదు ఏళ్లు సమయం పట్టిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఇంటికి వచ్చి పెన్షన్ అందజేశారన్నారు. జగన్ ఐదేళ్లలో ఒక్క డిఎస్‌సిగాని, మెగా డిఎస్‌సి కాని తీయలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలి సంతకం డిఎస్‌సి 16,500 పోస్టులకు మంజూరు చేశామని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో లిక్కరు, గనులు, విలువైన భూములు అన్ని అమ్ముకున్నారని, మరలా ప్రభుత్వం ఏర్పడితే అమ్ముకోటానికి ఏమీ లేదని, ల్యాండు టైటిలింగు తెచ్చి ప్రజలు, ప్రయివేటు భూములు కొల్లగొట్టడానికి ప్లాన్ వేశారన్నారు. మన ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ల్యాండు టైటిలింగు యాక్టును ఒక సంతకంలో ముఖ్యమంత్రి రద్దు చేసారన్నారు. ఈనెల 15 నుంచి రాష్ట్రంలో అన్నా క్యాంటీన్లు తెరుస్తున్నామని, నిరుపేదకు కేవలం రూ.15కు మూడు పూటలా కడుపునిండా భోజనం చేయవచ్చునని తెలిపారు. అధిక వర్షాలు, వరదల కారణంగా మన ఇంటి దగ్గరకు వరద రాకుండానే 25 కేజీలు బియ్యం, సరుకులు అందజేశామన్నారు. ఆనాడు అధికారం లేకపోయినా గంగడిపాలెంలో వారధి నిర్మాణం కొరకు పార్లమెంటు సభ్యులు కనుమూరి రఘురామ కృష్ణంరాజును రూ.10 లక్షల నిధులను అడిగి బ్రిడ్జి నిర్మాణం చేసుకున్నామని, మత్స్యకారులకు గ్రామ ప్రజలకు ఎంతో ప్రయోజనం ఉందన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు 80 శాతం రాయితీతో వరి విత్తనాలను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దారు బాజీ సత్యనారాయణ, పంచాయతీ రాజ్ డిఇ కె.దుర్గా స్వామి నాయుడు, ఎఇ వర్దనపు శ్యాంబాబు, గ్రామ సర్పంచులు మల్లాడి ఉమామహేశ్వరి, చల్లా వెంకట నాగలక్ష్మి, వలవల లక్ష్మి, ఆడబాల చిట్టిబాబు, నాయకులు జివి, పెచ్చెట్టి బాబు, మామిడిశెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.

నిట్‌లో కొత్త విద్యార్థుల సందడి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నిట్‌కు ప్రథమ సంవత్సరం విద్యార్థుల రాకతో సందడి నెలకొంది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎపి నిట్)లో బిటెక్ ప్రథమ సంవత్సరం మొత్తం ఎనిమిది కోర్సులకు సంబంధించిన 480 సీట్లలో 50 శాతం సీట్లు రాష్ట్ర విద్యార్థులతో, మిగిలిన వాటిని ఇతర రాష్ట్రాల విద్యార్థులతోను జోసా, సి-సాబ్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన కౌన్సెలింగ్‌లో మొత్తం 480 సీట్లకు అలాట్‌మెంట్లు పూర్తయ్యాయని, సీటు అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు ఫీజులు చెల్లించి ప్రవేశాలు పొందుతున్నారని, ఈ ప్రక్రియ ఈ నెల 14 వరకు జరగనుందని నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో సెంటర్ ఇన్‌ఛార్జిగా డీన్ అకడమిక్ డాక్టర్ టి.కురుమయ్య, డిప్యూటీ సెంటర్ ఇన్‌ఛార్జీలుగా ఆచార్యులు డాక్టర్ తపస్ పరమానిక్, డాక్టర్ రాముడు మాచవరపు వ్యవహరించారు. ప్రథమ సంవత్సరంలో సీట్లు పొందిన విద్యార్థులందరికీ ఈ నెల 16న ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నారు. మొదటి రోజు మొత్తం 54 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారన్నారు.

ఆక్వా రంగ అభివృద్ధే లక్ష్యం
కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ


కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను సన్మానిస్తున్న ఆక్వా రైతులు

ప్రజాశక్తి - ఉండి

ఆక్వా రంగ అభివృద్ధే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శని వారం మండలంలోని వాండ్రం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఫిష్ ట్రేడర్స్ అండ్ ప్యాకర్స్ అసోసియేషన్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లా డారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విదేశీ మారక ద్రవ్యాన్ని అధికంగా అర్జించే ఆక్వారంగం కుదేలైందన్నారు. ఆక్వారంగాన్ని అభివద్ధి పథంలో నడిపించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. దానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయన్నారు. భీమవరానికి ఆక్వారంగం వల్లె గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులకు నాణ్యమైన ఫీడ్, సీడ్ అందించి మేత ధరలు తగ్గించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆక్వా జోన్లతో సంబంధం లేకుండా ప్రతి ఆక్వా రైతుకూ విద్యుత్ సబ్సిడీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆక్వా రైతు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కామినేని శ్రీనివాస్, మంతెన రామరాజు మాట్లాడుతూ అధిక శాతం రైతులు ఆక్వారంగంపైనే ఆధారపడి ఉన్నారని, వారికి నాణ్యమైన మేత అందించేలా కంపెనీలతో మాట్లాడాలని కోరారు. అనంతరం భవన నిర్మాణానికి సహకారం అందించిన దాతలను మంత్రి వర్మ చేతుల మీదుగా సత్కరించారు. అనంతరం రైతులు మంత్రిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, బిజెపి జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

రహదారులపై టోల్‌ట్యాక్స్ ఆలోచన విరమించుకోవాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతారాం

ప్రజాశక్తి - పాలకొల్లు

గత జగన్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారని, ఇదే బాటలో చంద్రబాబు ప్రభుత్వం వెళ్తే ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం హెచ్చరించారు. రాష్ట్ర రహదారులపై టోల్‌టాక్స్ ఆలోచన విరమించుకోవాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాలకొల్లు పిపి రోడ్‌పై శనివారం సాయంత్రం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం సారధ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం విధించిన టాక్స్‌లు వాహనదారుల నడ్డి విరుస్తున్నాయని, దీనిపై ఇంకా భారం వేయడం తగదని నినాదాలు చేశారు. అనంతరం నిరసన ప్రదర్శనలో సీతారాం మాట్లాడుతూ ప్రజలు ఇప్పటికే ఆర్థిక సమస్యలతో సతమవుతున్నారని, వీరిపై భారం వేయడం తగదని హెచ్చరించారు. బలరాం మాట్లాడుతూ జాతీయ రహదారులపై వాహనదారులు ఇప్పటికే పన్నుల పోటుతో సతమతమవుతున్నారని, వీరిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా పన్ను విధించాలని నిర్ణయించడం వెంటనే విరమించుకోవాలి అని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, పివి.ప్రతాప్, కవురు పెద్దిరాజు, కర్రి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, డెల్టా జిల్లా నేతలు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులను ఆదుకుందాం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నిండు ప్రాణాలను కాపాడటంలో కలిగే సంతోషమే వేరని, రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శనివారం భీమవరం 32 డెంటల్ కేర్ హాస్పటల్ వద్ద హెూప్ చారిటబుల్ ట్రస్ట్, ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా బాధితులకు రక్తదానంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ మీ రక్తదానం 45 మంది తలసేమియా చిన్నారులలో ఒకరికి ప్రాణదానం అవుతుందని, ప్రతి 20 రోజులకు ఒక్కసారి రక్తం ఎక్కించుకుని తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదానం అవసరమని అన్నారు. మానవత్వంతో ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి సహకరించాలని, ప్రభుత్వాసుపత్రిలో ఈ వ్యాధిగ్రస్తులకు వైద్యం, రక్తదానం చేయడానికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. హెూప్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అల్లాడి రవితేజ మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే రక్తదాత పున:జన్మనిస్తారని, ప్రతీ 20 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించుకొనే వారికి ఫిల్టర్ సెట్స్, మందులు మార్కెట్‌లో దొరకక బాధపడుతున్న తలసేమియా చిన్నారుల, వారి తల్లిదండ్రుల ఇబ్బందులు పడుతున్న వారి కోసం హెూప్ ఫర్ తలసేమియా అవగహన సదస్సును చేపట్టామని అన్నారు. తలసేమియా బాధితులకు రక్తదానం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంసి మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, వబిలిశెట్టి రామకృష్ణ, పొత్తూరి బాపిరాజు, సభ్యులు నూకల శివ, బొల్లం సాయి, సబ్బవరపు వినోద్, గంధం దుర్గాప్రసాద్, కట్టా సత్యనారాయణ, లింగం పవన్ కుమార్, చినపరపు నాగార్జున పాల్గొన్నారు.

ఆవేదన.. ఆక్రందన..!



పాలకుల నిర్లక్ష్యం.. వ్యవస్థల వైఫల్యం వెరసి జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాలతో వివిధ తరగతుల ప్రజానీకం ఆవేదనకు గురవ్వడంతోపాటు ఆక్రందనలు చేసే పరిస్థితి. ఆయా సందర్భాల్లో హడావుడి చేస్తున్న అధికారులు, పాలకులు శాశ్వత చర్యలపై దృష్టి పెట్టేదెప్పుడో.. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసెదెన్నడో అనే చర్చ రెండు జిల్లాల్లో పెద్దఎత్తున సాగుతోంది.

కృష్ణా డెల్టా ఆయకట్టు రైతులు సాగునీటి కోసం రోడ్డెక్కడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఓపక్క వర్షాలు.. మరోపక్క గోదావరి, కృష్ణా నదులకు వరదలు వెరసి పశ్చిమడెల్టా ముంపుబారిన పడుతుంటే కృష్ణా డెల్టా ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఆందోళనలు చేస్తుండటం చర్చనీయాంశమైంది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసి పంటలు మునిగిన సందర్భంలో.. కాల్వల ద్వారా నీటి ప్రవాహం సాగక భూములు బీడువారినప్పుడు అధికారులు హడావుడిగా కాల్వల్లో పేరుకుపోయిన చెత్త, తూడు, గుర్రపుడెక్క తొలగిస్తున్నారు. నష్టం జరిగాక, రైతులు రోడ్డెక్కాక అధికారులు స్పందించడంతో అప్పటికే రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రకృతి సహకరించినా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తాము సకాలంలో సాగు చేయలేకపోతున్నామని, చేసినా ఆయా పంటలు ఎండిపోకుండా రక్షించలేకపోతున్నామని కృష్ణా ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు.

చిన్నారులపై లైంగిక దాడులు నివ్వెరపరుస్తున్నాయి. కుక్కునూరు, ఆకివీడు ఘటనలు మరువక ముందే నూజివీడు మండలంలో చిన్నారిపై లైంగిక దాడి సంచలనం సృష్టించింది. అందరినీ కలిచివేసింది. ఇంటి వద్దే ఆరుబయట నానమ్మ ఒడిలో నిద్రిస్తున్న బాలిక (4)ను అపహరించి అఘాయిత్యానికి పాల్పడటం ఇక చిన్నారులకు రక్షణ ఎక్కడనే చర్చ సాగుతోంది. నిందితుడు గతంలో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడి జైలుకెళ్లి బెయిల్‌పై వచ్చినట్లుగా పోలీసులు గుర్తించడం అందరినీ విస్మయపర్చింది. అంటే కేసు, జైలు, శిక్ష అనేవి ఆ ప్రబుద్ధునిలో ఎటువంటి మార్పూ కల్గించకపోగా మరింత తెగింపుతో నిద్రిస్తున్న బాలికను ఎత్తుకెళ్లి మరీ అత్యాచారానికి పాల్పడ్డాడంటే వ్యవస్థల వైఫల్యం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి ముందు కుక్కునూరు మండలంలో తెలిసిన వ్యక్తే బాలికకు మాయమాటలు చెప్పి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడగా ఆకివీడులో లిఫ్ట్ అడిగిన బాలికపై యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఓపక్క మహిళలపై అత్యాచారాలు, అకృత్యాలు పెరిగిపోయాయని ఆందోళన చెందుతుండగా మరోపక్క ముక్కుపచ్చలారని బాలికలపైనా కామాంధులు అఘాయిత్యాలకు పాల్పడటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా పాలకులు చట్టాలు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా అఘాయిత్యాలకు కారణమవుతున్న, ప్రేరేపిస్తున్న అంశాలు గుర్తించి వాటి నిర్మూలనపై దృష్టి సారిస్తే ఫలితం ఉంటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈలోపు ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు త్వరితగతిన విచారణ పూర్తి చేసి కఠిన శిక్షలు విధించేలా చూడాల్సిన బాధ్యత పోలీసుశాఖపైనా ఉంది.

ఇక టి.నర్సాపురంలో తెల్లవారుజామున ప్రభుత్వ దవాఖానాకు అత్యవసర వైద్యం కోసం వెళ్తే గేట్లు వేసి ఉండటంతోపాటు ఆపై వైద్యులు అందుబాటులో లేకపోవడం.. ఫలితంగా ఓ బాలింత కన్నుమూయడం బాధాకరం. రోజుల వయస్సులోనే తల్లిని కోల్పోయిన ఆ పసికందు జీవితాంతం ఆ లోటును భరించాల్సిందే. స్టాఫ్ నర్సు మాత్రమే ఆసుపత్రిలో ఉండగా అక్కడ వైద్యం అందించడానికి మీనమేషాలు లెక్కించారని బాలింత బంధువులు ఆరోపిస్తున్నారు. పైగా ఆ సమయంలో విధుల్లో ఉండాల్సిన డాక్టర్ ఎక్కడున్నారనేది ఉన్నతాధికారులే చెప్పాలి. పైగా వైద్యం అందించే ప్రయత్నం చేస్తుంటే బంధువులే బాలింతను తీసుకెళ్లిపోయారని ఆరోపించడం అత్యంత అమానుషం. అసలు బాలింతకు వచ్చిన సమస్య ఏమిటీ, దానికి సంబంధించిన వైద్యం చేసే అవకాశం అక్కడి ఆసుపత్రిలో ఉందా లేదా అనేది అక్కడి వైద్యురాలు చెబితే బాగుండేది. అలాకాకుండా మృతురాలి బంధువులపై నెపం వేసే ప్రయత్నం చేయడం తప్పించుకునే ప్రయత్నమేనని స్పష్టమవుతోంది. గేటు తెరిచే వరకూ అరగంట వరకూ వేచి ఉన్న బంధువులు మరో గంట వేచి ఉండలేరా అనే అంశం దగ్గర నుంచి పరిశీలిస్తే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది. బాలింతకు సకాలంలో వైద్యం అందక పరిస్థితి విషమించడం, దీంతో చికిత్స చేసేందుకు స్టాఫ్ నర్సు వెనుకాడటం, పైగా వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్లే ఈ ఘోరం చోటుచేసుకుందని తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి పిహెచ్‌సిల్లో వైద్యసౌకర్యాలు మెరుగుపర్చడంతోపాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని జనం కోరుతున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

ఎస్ఆర్‌కెఆర్‌కు ఎన్‌పిటిఇఎల్ 'ఎ' గ్రేడ్

భీమవరం టౌన్: ఐఐటీ చెన్నై జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న ఎన్‌పిటిఇఎల్(నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్ లెర్నింగ్) కోర్సుల్లో ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయస్థాయిలో 'ఎ' గ్రేడ్ లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు తెలిపారు. కళాశాల టెక్నాలజీ సెంటర్‌లో 2017లో ఎన్‌పిటిఇఎల్ ఆన్‌లైన్ కోర్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. జాతీయస్థాయిలో ఎ గ్రేడ్ సాధించడంతో పాటు టాప్ 200 ర్యాంకు కూడా అందుకోవటం పట్ల కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ, నిషాంత్ వర్మ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజును టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాల్ కృష్ణమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ కెఆర్‌ఎన్‌పిటిఇఎల్ కోర్సెస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ గత జనవరి నుంచి ఏప్రిల్ వరకు జరిగిన ఆన్‌లైన్ కోర్సెస్‌లో 454 మంది విద్యార్థులు, అధ్యాపకులు ఈ కోర్సులో విజయం సాధించారన్నారు. ఇందులో ఇద్దరికి బంగారు పథకాలు, 77 మందికి సిల్వర్ పథకాలు, మరో 218 మంది ఎలైట్ పథకాలు సాధించటంతో దేశంలోని తమ సెంటర్ అత్యుత్తమ ఫలితాలు సాధించిన సంస్థల్లో ఒకటిగా నిలిచిందని అన్నారు. గత 2017 నుంచి ఇప్పటి వరకూ 24 వేల మంది విద్యార్థులు, వీరితోపాటు అధ్యాపకులు ఆన్‌లైన్ కోర్సుల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఎస్‌డి విభాగం ఇన్‌ఛార్జి హెడ్ డాక్టర్ ఎం.సురేష్ బాబు పాల్గొన్నారు.

మంత్రిచే డయాలసిస్ కేంద్రం ప్రారంభం


డయాలిసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక జనతా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు శనివారం ప్రారంభించారు. అలాగే ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్ క్రిటికల్ కేర్, ఐసియు విభాగాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు పట్టణ పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ముఖ్యంగా డయాలసిస్ సెంటర్ సేవలు పేదలకు తక్కువకే అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు ఆర్.శ్రీసాహిత్య, మిథున్ చక్రవర్తి, పెచ్చెట్టి బాబు, జివి, మేడికొండ శ్రీనివాస్, జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు.

రహదారులపై గోతులు పూడ్చండి

అధికారులకు ఎంఎల్ఎ బొలిశెట్టి ఆదేశం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం నుంచి తణుకు రహదారిలో తీవ్ర వర్షాలతో గోతులమయమైన రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం తాడేపల్లిగూడెం ఓవర్ బ్రిడ్జి నుండి ప్రత్తిపాడు వరకూ వర్షం కారణంగా అధ్వానంగా మారిన రహదారులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఇప్పటికే ఈ రోడ్ల విస్తరణ దశకు చేరుకున్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నిర్మాణం జరగలేదని, అతి త్వరలోనే ఈ రోడ్లను నిర్మాణం ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గుంతలను పూడ్చాలని అధికారులను ఆయన ఆదేశించారు. గుంతల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి గాయాలపాలవుతున్న నేపథ్యంలో వెనువెంటనే రోడ్లకు మరమ్మతులు చేయాల్సిందిగా ఆయన ఆదేశించారు. తాడేపల్లిగూడెం నుంచి జువ్వలపాలెం, ప్రత్తిపాడు, అలంపురం రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆర్అండ్బి అధికారులతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'అంబేద్కర్ స్మృతివనంపై దాడి అమానుషం'

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్ర రాజధాని విజయవాడ నడిబొడ్డున స్వరాజ్ మైదానంలో సుమారు 18 ఎకరాల విస్తీర్ణంలో రూ.404 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నిర్మించిన సామాజికవేత్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనంపై కొంతమంది దుండగులు చేసిన దాడి దారుణమని దీనిని ప్రజాస్వామ్యవాదులందరూ తీవ్రంగా ఖండించాలని అంబేద్కర్ ఆలోచనా వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవాకుల భరత్ కుమార్ కోరారు. శనివారం ఆయన పత్రికల వారితో మాట్లాడుతూ ఈ దాడిని దళిత, బహుజనులపై జరిగిన దాడిగా అందరూ పరిగణించాలని తెలిపారు. ప్రభుత్వం దోషులను వెంటనే గుర్తించి, వారిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని భరత్ డిమాండ్ చేశారు.

నరసాపురం: విజయవాడలో దేశంలోనే అతిపెద్దదైన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నెలకొల్పిన అంబేద్కర్ స్మృతివనం ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన టిడిపి దుండగులను కఠినంగా శిక్షించాలని వైసిపి దళిత నేతలు డిమాండ్ చేశారు. విజయవాడ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శనివారం పట్టణంలో ఆందోళన నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్లో నిరసన సభ జరిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ, ఎంపిపి మైలాబత్తుల సోని పాల్గొన్నారు.

కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - తణుకు

ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల మూడునెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎపి మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. శనివారం తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.అరుణకు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ మూడు నెలల వేతన బకాయిలతో పాటు ఈ ఏడాది జనవరి నుంచి పిఎఫ్ సొమ్ము కార్మికుల ఖాతాల్లో జమ చేయకుండా వుంచుతున్నారు. తక్షణమే వేతన బకాయిలు, పిఎఫ్ సొమ్ము జమచేయాలని భీమారావు డిమాండ్ చేశారు. మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్.చింతాలు, డి.లక్ష్మణరావు, ఎం.బేబీ, ఎం.వెంకటలక్ష్మి, ఎస్.లక్ష్మి, డి.ప్రసన్నకుమారి, యు.లక్ష్మి పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవడంపై హర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

జాతీయ చేనేత దినోత్సవం వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేతకు అనేక వరాలు కురిపించి అందరికీ ఆనందం కలిగించారని నరసాపురం డివిజన్ దేవాంగ బిసి సాధికార సమితి కన్వీనర్ రొప్పి భాస్కరరావు అన్నారు. శనివారం ఆయన ఇక్కడ పత్రికల వారితో మాట్లాడుతూ తొందరలోనే చేనేతకు జిఎస్‌టిని తొలగిస్తామని, అలా వీలుపడని పక్షంలో ఆ మొత్తం రీయింబర్స్ చేస్తామని చెప్పడం చేనేత కార్మికులను ఆదుకోవడమేనని హర్షం తెలిపారు. అలాగే మంగళగిరిలో రాష్ట్రంలోనే లోకేష్ చేనేతలు అభివృద్ధి చేస్తూ వీరు మహా అద్భుతంగా ఉందని, చేనేత వస్త్రాల నేషనల్, ఇంటర్నేషనల్ మార్కెట్‌లో దొరికేలా చూడటం ఆనందదాయకమని అన్నారు. చేనేతకు వస్తున్న సబ్సిడీలను గత ప్రభుత్వం ఆపేసిందని, తిరిగి పునరుద్ధరిస్తామని చెప్పడం, ఆప్కోలో చేనేత నూలు పోగు, పట్టు పైన వచ్చే ప్రభుత్వ సబ్సిడీలను తిరిగి పునరుద్ధరిస్తామనడం నిరుపేద చేనేత కార్మికులకు కొత్త ఊపిరులూదినట్లైందని సంతోషం వ్యక్తం చేశారు.

'చంద్రబాబును విమర్శించే హక్కు జగన్‌కు లేదు'

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విమర్శించే నైతిక హక్కు పులివెందుల ఎంఎల్ఎ వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి లేదని జనసేన, టిడిపి, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి గుడాల సునీత అన్నారు. శనివారం నరసాపురం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీత మాట్లాడారు. చంద్రబాబుపై జగన్ పత్రిక తప్పుడు కథనాలను ప్రచురిస్తున్నారని, అందులో వాస్తవం లేదన్నారు. గత వైసీపీ ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారని తెలిపారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చేసిన ఘనత జగన్‌దే దక్కుతుందన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రం నడిబొడ్డున ఉన్న అమరావతిని రాష్ట్ర రాజధానిగా శరవేగంగా తీర్చిదిద్దేందుకు సిఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని సునీత అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమాని శశికల, ప్రధాన కార్యదర్శి పాల దుర్గా భవాని, కార్యదర్శి బొమ్మి రాజేశ్వరి, మాజీ ఎంపిటిసి చెల్లబోయిన కనకదుర్గ ఉన్నారు.

మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి

ఎంఎల్ఎను కోరిన చెరుకువాడవాసులు

ప్రజాశక్తి - ఉండి

తమ భూములకు బహిరంగ మార్కెట్ ప్రకారం విలువ చెల్లించి తమకు న్యాయం చేయాలని ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజును శనివారం ఉండి మండలం చెరుకువాడ గ్రామ గురువుపేట ప్రాంతవాసులు అభ్యర్థించారు. చెరుకువాడ గ్రామం దీర్ఘాను 165 జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సుమారు 60 కుటుంబాలు వారు 70 సంవత్సరాలకు పైబడి నివాసం ఉంటూ గ్రామ పంచాయతీకి ఇంటిపన్నులు, మంచినీటి పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లించుకుంటూ నివసిస్తున్నామన్నారు. జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భాగంగా ఇండ్లను తొలగించేందుకు మార్కింగ్ చేశారని, దీని కారణంగా నివాస ఆధారాలు కోల్పోతున్న నిర్వాసిత కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపించి, నష్టపరిహారం ఇప్పించి, బాధితులకు న్యాయం చేయాలని ఉండి ఎంఎల్ఎ కార్యాలయంలో రఘురామకృష్ణరాజుకు బాధితులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు బాధితులకు ప్రత్యామ్నాయం ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందేలా తెలిపారు. నిర్వాసితులకు న్యాయం చేయాల్సిందేనని స్థానిక టిడిపి నాయకులు కట్ట రామచంద్రరావు(రాంబాబు) ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజును కోరారు.

పెన్షన్‌గా సొంత సొమ్ము అందజేత


పాలకొల్లు రూరల్: మండలంలోని తిల్లపూడి గ్రామానికి చెందిన కామిశెట్టి స్వామి అయ్యప్ప నాయుడు వృద్ధురాలికి తన సొంత సొమ్ము రూ.4 వేలను పెన్షన్‌గా అందజేశారు. గ్రామానికి చెందిన వితంతువు చేగొండి సీతమ్మకు గత వైసిపి ప్రభుత్వంలో పెన్షన్ మంజూరు కాలేదు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చే పెన్షన్ ఇప్పిస్తామని ఆమెకు అయ్యప్ప నాయుడు మాట ఇచ్చారు. కొత్త పెన్షన్ పాలసీ ఇంకా రాలేదని, ఈమెకు ప్రభుత్వ పరంగా మంజూరయ్యే వరకూ ప్రతినెల రూ.4 వేలు చొప్పున ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీంతో అయ్యప్ప నాయుడును గ్రామానికి చెందిన నాయకులు కంటి శ్రీరాములు, నీలం నారాయణమూర్తి(తాతాజీ), బోడపాటి కాశీ విశ్వనాథం అభినందించారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు

తాడేపల్లిగూడెం: కోతి బొమ్మ సెంటర్, గాంధీ బొమ్మ, గాంధీ గుడి ఏరియాలలో విద్యుత్ ఎప్పుడుంటుందో తెలియక ప్రజలు అనేక ఇబ్బందులను గురవుతున్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి ప్రతిరోజు మున్సిపల్ వాటర్ వచ్చే టైంకి ఉదయం 6 గంటలకు, సాయంత్రం ఐదున్నరకు(రెగ్యులర్‌గా రోజుకి రెండుసార్లు) కరెంట్ కట్ చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. 6 తర్వాత కూడా మళ్లీ కరెంట్ తీసేస్తున్నారన్నారు. మంచి నీరు పట్టుకోవడం సాధ్యం కావటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఏదో ఒక ఫేజ్ రోజూ పోతుంది. రాత్రి టైంలో కూడా ఎప్పుడు పోతుందో తెలీదు. దానికి తోడు ఉక్కపోత వాతావరణం, ఒకవైపు ఉక్కపోతతో వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, బాలింతలు అనేక అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అప్రకటిత విద్యుత్ కోతల నుంచి ప్రజల్ని రక్షించాలని కోరుతున్నారు.

ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

కాళ్ల: యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పట్టాభిరామయ్య కోరారు. యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కాళ్ల మండల శాఖ పక్షాన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వేంపాడు(హెచ్)లో శనివారం ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎంకె స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కవులూరి సత్యనారాయణ, పొదిల శ్రీరామకృష్ణ చేతుల మీదుగా పతాకాన్ని ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు పి.శ్రీనివాసరాజు, బిఆర్ఎంకె.స్వామి, జి.రామకృష్ణంరాజు, కిషోర్ పతాక గేయాన్ని ఆలపించారు. సీనియర్ నాయకులు శ్రీనివాసరాజు యుటిఎఫ్ ఆవిర్భావం జరిగిన నాటి నుంచి నేటి వరకూ జరిగిన పరిణామాలను వివరించారు. యూనియన్ ఆవశ్యకతను తెలియజేశారు. కాళ్ల మండలంలో సీనియర్ నాయకులైన ఉద్యోగ విరమణ చేసిన రామకృష్ణ, సత్యనారాయణలకు చిరు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శంకర్, రాజ్యలక్ష్మి, కనకదుర్గ, మణి, అశోక్, రవికుమార్, అప్పలాచార్యులు, వర్మ పాల్గొన్నారు.



కాళ్ల : యుటిఎఫ్ సీనియర్ నాయకులు సత్యనారాయణ, శ్రీరామకృష్ణలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పారిశుధ్య కార్మికులకు అల్పాహారం అందజేత

నరసాపురం: యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం యుటిఎఫ్ నాయకులు నరసాపురం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు స్వీట్స్, అల్పాహారం అందించారు. అనంతరం యుటిఎఫ్ భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో జాతీయ జెండాను కౌరు నందికేశ్వరారవు, ఎస్‌టిఎఫ్ఐ పతాకం ఆర్ఆర్‌కె రాజు, యుటిఎఫ్ పతాకమును కొండేటి ప్రమీల ఆవిష్కరించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.మార్కండేయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా అమరులైన ఉద్యమ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించి వారి సేవలను కొనియాడారు. వేడుకలలో భాగంగా సీనియర్ కామ్రేడ్(విశ్రాంత ఉపాధ్యాయులు) కౌరు నందికేశ్వరరావు, మరోక సీనియర్ కామ్రేడ్ ఆర్ఆర్‌కె.రాజు వారి సేవలను కొనియాడుతూ చిరు సన్మానం చేసి స్వీట్స్ పంచుకున్నారు. జిల్లా కార్యదర్శి పి.కృష్ణకుమారి, జిల్లా ఆడిట్ మెంబెర్స్ పి.శ్రీనివాస్, జిఎస్ఎస్ ఆర్.స్వామి, నరసాపురం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌వి.సత్యన్నారాయణ, ఎస్.అజయ్ కుమార్, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి నంబూరి కుమార్ పాల్గొన్నారు.

మొగల్తూరు : యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మొగల్తూరులోని ఎస్ఆర్ పోలిశెట్టి టీచర్ హోమ్ నందు శనివారం ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.శ్రీనివాస్, అధ్యక్షులు చింతపల్లి కృష్ణమోహన్ అధ్యక్షతన స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేశామని గుర్తు చేశారు. అనంతరం యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు పొదిలి కృష్ణమూర్తి ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాలలో మండలంలోని విశ్రాంత ఉపాధ్యాయులు చింతపల్లి ఆంజనేయులు, ఎస్ఎంఎస్ అలీవలి, నాయకులు ఎన్.బుజ్జి బాబు, ఎ.మురళీధర్, కె.బ్రహ్మాయ, టి.మాధవ్, ఎస్‌కె.జానీ, వై.శ్యాంబాబు, సిహెచ్.సూర్య ప్రకాష్, కెఎన్‌వి.సుజాత, జెఎస్‌వివి .లింగేశ్వరరావు, కె.శేష శ్రీను, కె.వరప్రసాద్, ఎం.సాయికుమార్ పాల్గొన్నారు.

వీరవాసరం : మండలంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వీరవాసరం ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో సీనియర్ యుటిఎఫ్ నాయకులు వీరవల్లి భాస్కరావు యుటిఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, జిల్లా అధ్యక్షులు పి.విజయరామరాజు, రాష్ట్ర కౌన్సిలర్ రామానుజరావులు పాల్గొని ఆవిర్భావ ఉద్దేశాలు, చేసిన పోరాటాలు, సాధించిన ఫలితాలు విజయాలు, భవిష్యత్తు కర్తవ్యాలు గురించి వివరించారు. ఆనాటి ఉద్యమ నాయకులను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించారు. యుటిఎఫ్


ఆకివీడులో..

మండల ప్రధాన కార్యదర్శి ముద్రగళ్ల శ్రీనివాసరావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే ఇవ్వాలని, ప్రస్తుతం వర్క్ అడ్జెస్ట్మెంట్ జిఒ 117కు బదులుగా జిఒ 53 ప్రకారం జరపాలని, పిఎఫ్ సమస్యలు పరిష్కరించాలని, ఎంటిఎస్ టీచర్స్‌ను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం వెంటనే చొరవ చూపి సమస్యలు పరిష్కరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, జిల్లా అధ్యక్షులు పి.విజయరామరాజు, జివి.రామానుజరావు, రాష్ట్ర కౌన్సిలర్ గోవిందరాజులు, సీనియర్ నాయకులు డి.పుల్లారావు, జిల్లా కౌన్సిలర్ కె.నాగమునేశ్వరావు, మండల గౌరవ అధ్యక్షులు రాజామణి, జిల్లా కాన్సెలర్‌లు ప్రసాదబాబు, సాయి బాబు, శ్రీనివాసరావు, రాజు, సత్యనారాయణ, దుర్గారావు, మాధవరావు పాల్గొన్నారు.

గణపవరం: యుటిఎఫ్ 50 వసంతాల సంబరాల సందర్భంగా గణపవరంలో యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్‌లో యుటిఎఫ్ పతాకాన్ని యుటిఎఫ్ జిల్లా నాయకులు హెూతా ఆంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి అనేక ఉద్యమాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యను ప్రయివేటుపరం కాకుండా యుటిఎఫ్ చేసిన ఆందోళనలు వివరించారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. పదో తరగతి టెస్ట్ పేపర్లు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో మోడల్ పేపర్ తయారు చేసి అందుబాటు ధరలో విద్యార్థులకు అందించినట్లు చెప్పారు. వయోజన విద్య అత్యధిక కార్యక్రమాల్లో రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ చేసిన కృషిని వివరించారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జనవిజ్ఞాన వేదిక ఏర్పాటులో తమ వంతు కృషి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కమిటీ అధ్యక్షులు జె.నాని, జి.భగవాన్ ప్రసాద్, నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, రమేష్, నరసమ్మ పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని మేడపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం యుటిఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్మించిన స్వర్ణోత్సవ స్తూపం, యుటిఎఫ్ స్వర్ణోత్సవ లోగో పతాక ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా యుటిఎఫ్ సీనియర్ నాయకులు పోలిశెట్టి గోపాలకృష్ణ గోకలే, రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, మాజీ రాష్ట్ర కార్యదర్శి సరిపల్లి జయప్రభ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దండు పద్మావతి, సీనియర్ నాయకులు దేవా సుధాకర్ హాజరయ్యారు. అనంతరం ఉద్యమ నిర్మాతలైన అమరవీరులు చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకటస్వామి, దాచురి రామిరెడ్డి, ఎస్ఆర్ పోలిశెట్టి మైనేని వెంకటరత్నం, నాగటి నారాయణ, ఎంఎల్‌సి షేక్ సాబ్జిలకు అరుణాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గంటా శాంతకుమారి, ఎంపిటిసి డేగల ప్రభావతి, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి అడ్డాల వాసుదేవరావు పాల్గొన్నారు.

ఆకివీడు : యుటిఎఫ్ హక్కులతో పాటు బాధ్యతలు నిర్వహిస్తుందని, అధ్యయనం, అధ్యాపనం చేస్తుందని ఆ సంఘ జిల్లా కోశాధికారి ఎస్.పట్టాభి వివరించారు. సమాఖ్య ప్రారంభమై నేటికి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక సంఘం కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల కార్యదర్శి ఐ.రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పట్టాభి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘ మండల అధ్యక్షులు, జిల్లా సత్యనారాయణ మాట్లాడుతూ తమ సంస్థ నిస్వార్థంగా ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అనంతరం అమరవీరులకు నివాళిలర్పించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ వలి గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది.


నరసాపురంలో..


వీరవాసరంలో


గణపవరంలో



యలమంచిలిలో

నేడు పిఎంపిల సమావేశం

ప్రజాశక్తి - మొగల్తూరు

పిఎంపిల మొగల్తూరు మండల శాఖా సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నామని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కెఎస్‌పిఎన్.ముక్తేశ్వరరావు, సిహెచ్ విపి.శ్రీనివాస ప్రసాద్‌లు తెలిపారు. ముత్యాలపల్లిలోని మోటిపల్లి రాజాస్ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న 25వ వార్షికోత్సవానికి సభ్యులందరూ రావలసిందిగా కోరారు.

బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం, కెపి పాలెం బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను శనివారం విద్యార్థులు తొలగించారు. మొగల్తూరులోని ఎస్‌కెవిఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు సేవా కార్యక్రమంలో భాగంగా బీచ్‌లోని ప్లాస్టిక్ వ్యర్థాల చెత్తలను తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎఒ ఎ.అరుణ, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు సమాజానికి ఆదర్శవంతం కావాలి

ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు రాజరాజేశ్వరి

ఆకివీడు : విద్యార్థులు భావిభారత నిర్మాతలని, వారు సమాజానికి ఆదర్శవంతంగా ఎదగాలని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కాకర్ల రాజరాజేశ్వరి పిలుపునిచ్చారు. స్థానిక విద్యావికాస్ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు వెల్కమ్ పార్టీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ చొప్పర్ల బలరాం బాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె ముఖ్యఅతిగా పాల్గొని మాట్లాడారు. ఎందరికో ఉన్నత విద్యను, సంస్కారాన్ని అందించిన ఈ కళాశాలలో సివిల్ సర్వీసులకు కూడా చేరుతున్నారన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకునే దిశగా పయనించాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధాన సలహాదారు ముత్యాల వెంకటస్వామి మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగ సాధనే లక్ష్యంగా, ఈ కళాశాల పయనించడం గర్వకారణం అన్నారు. 35 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ కళాశాల నేడు వివిధ కోర్సుల ద్వారా 1300 మందిని ఈ సంవత్సరం పరీక్షలకు పంపుతున్నామన్నారు. ఈ కళాశాలలో 67 మంది ఇతర సిబ్బందితో నిర్వహిస్తున్నామన్నారు. కళాశాలలో వైద్య ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. సమావేశంలో ఆదర్శ ఆలయన్స్ క్లబ్ కార్యదర్శి మోరా జ్యోతి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రికి వినతి

పాలకొల్లు: 2014 నుంచి పంచాయతీలలో పనిచేస్తున్నా, జీతాలు పంచాయతీలలోని జనరల్ ఫండ్స్ నుంచి కాకుండా 15వ ఫైనాన్స్ నుంచి ఇస్తున్నారని, తమకు ఎమ్‌టిఎస్ పద్ధతిలో జాబును చేసి, ఉద్యోగ భద్రత కల్పించి సకాలంలో జీతాలు ప్రభుత్వం నేరుగా ప్రతీనెల ఇచ్చేలా చేయాలని పంచాయతీలలో పనిచేసే ఇ-ఆపరేటర్లు కోరారు. ఈమేరకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఆపరేటర్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం సమర్పించారు. చాలి చాలని జీతాలతో కుటుంబ పోషణ చేస్తున్నామని తెలియపరచగా దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టిలో పెడతానని, న్యాయం చేసేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

విష్ణు కళాశాలలో సెల్ఫ్-లాండ్రీ సర్వీస్ ప్రారంభం


భీమవరం టౌన్: విద్యార్థి జీవితాన్ని మెరుగుపరిచే తమ మిషన్ కొనసాగింపులో భారతదేశపు ప్రీమియర్ వినియోగదారుల డ్యూరబుల్ బ్రాండ్ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ తమ వినూత్నమైన సెల్ఫ్-లాండ్రీ సర్వీస్‌ను శ్రీవిష్ణు ఇంజనీరింగ్ కాలేజీ కోసం శుక్రవారం విడుదల చేసింది. దీనిలో భాగంగా 5 మెషీన్లు ఇన్‌స్టాల్ చేసింది. గల్ గోటియాస్ కాలేజీ, గల్ గోటియాస్ యూనివర్శిటీ, బిట్‌సమ్, ఎన్‌ఐటి, గోవా మొదలైన ప్రాంతాల్లో విజయవంతంగా చేసిన పరిచయంపై ఈ విస్తరణను కొనసాగించింది. కాలేజీలో కొత్త సెల్ఫ్-లాండ్రీ సదుపాయం సుమారు 5,300 మంది విద్యార్థులకు సేవలు అందిస్తుంది. 'లాండ్రీ క్రూ' యాప్ ద్వారా ఎల్జీ కమర్షియల్ వాషింగ్ మెషిన్స్‌ను ఉపయోగించే సౌకర్యాన్ని అందిస్తుంది. మెషిన్ రిజర్వేషన్స్, ఆపరేషన్స్, స్వయంచాలిత చెల్లింపులను ప్రారంభించడం ద్వారా ఈ యాప్ లాండ్రీ ప్రక్రియను అమలులోకి తెస్తుంది. విద్యార్థులకు ఇబ్బందులు లేని అనుభవం కలగజేస్తుంది. 'విద్యార్థులకు ఆచరణ సాధ్యమైన, వినూత్నమైన పరిష్కారాలను తీసుకురావడం, తమ సమయాన్ని మెరుగ్గా నిర్వహించడంలో వారికి సహాయపడటం తమ లక్ష్యం' అని హెూంగ్జు జియాన్, ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా ఎండి అన్నారు. 'ఈ సేవతో, మేము విద్యార్థుల కోసం మరింత సౌకర్యవంతమైన, సమర్థవంతమైన వాతావరణాన్ని సృష్టించే లక్ష్యాన్ని కలిగి ఉన్నామని తెలిపారు. ఆధునిక టెక్నాలజీకి, మా వినియోగదారుల కోసం రోజూవారీ జీవితాన్ని మెరుగుపరచడానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. తమ ఇటీవలి 'లైఫ్ ఈజ్ గుడ్ విత్ ఆప్టిమిజమ్' కాంపైన్ జెన్‌తో మరింత కలుపుతుందన్నారు. తమ దిగ్గజ లైఫ్ ఈజ్ గుడ్, సిద్ధాంతంపై విస్తరిస్తోంది, సంస్థకు తమ సెల్ఫ్-లాండ్రీ సేవలను విస్తరించడం ద్వారా ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ విద్యారంగం కమ్యూనిటీకి తమ మద్దతును అంకితం చేయడం ప్రదర్శించింది. ఈ చొరవ రోజూవారీ జీవితంలోకి వినూత్నమైన టెక్నాలజీని సమీకృతం చేసి, విద్యార్థుల రోజూవారీ జీవితంలో సహాయపడటానికి, వారి పూర్తి క్యాంపస్ అనుభవాన్ని మెరుగుపరచడానికి చేసిన విస్తృతమైన వ్యూహంలో ఒక భాగం.

రైల్వేగేటు మూసివేతతో రైతుల అవస్థలు

కేంద్రమంత్రికి సర్పంచి వెంకటకృష్ణ వినతి

ప్రజాశక్తి - ఉండి

వాంద్రం రహదారిలోని రైల్వేగేటు ప్రతిరోజు రాత్రి ఏడు గంటలకు మూసివేసి ఉదయం తెరవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాంద్రం గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం ఉండి మండలం వాంద్రం గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ ఫిష్ ట్రేడర్స్ అండ్ ప్యాకర్స్ అసోసియేషన్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మకు రైల్వేగేటు మూసివేతపై దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాసరి వెంకటకృష్ణ మాట్లాడుతూ సుమారు ఐదు గ్రామాల రైతులు ఈ రహదారి నుండే నిత్య కార్యకలాపాలు చేస్తుంటారని, రాత్రి వేళలో ఈ గేటు


కేంద్రమంత్రికి వినతిని అందజేస్తున్న సర్పంచి

మూసివేత కారణంగా రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్య పరిష్కరించేందుకు కృషిచేయాలని ఆయనను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వాంద్రం గ్రామ మాజీ సర్పంచులు రెడ్డిపల్లి సత్యనారాయణ, యాడంగి ఏసు ఉన్నారు.

హామీలు అమలు చేయాలి

నరసాపురం: గత ప్రభుత్వంలో జరిగిన 42 రోజుల సమ్మె సందర్భంగా మినిట్స్ కాపీ ద్వారా ఇచ్చిన హామీలు అమలు చేయాలని అంగన్వాడీ జిల్లా అధ్యక్షులు కె.ఝాన్సీలక్ష్మీ అన్నారు. శనివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో మొగల్తూరు ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మొగల్తూరు ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి జి.పెద్దింట్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మీ మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం వెంటనే పెంచాలన్నారు. మార్కెట్ రేటుకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. అర్హత కలిగిన అంగన్వాడీ టీచర్లను సూపర్వైజర్‌గా, ఆయాలను టీచర్లుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాయకులు గ్రామాల్లో రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. అంగన్వాడీ సమస్యలపై అసెంబ్లీలో చర్చించి, పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, పేద ప్రజలకు సేవచేస్తున్న అంగన్వాడీ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. టిఎ బకాయిలు ఇవ్వాలని, గ్రాడ్యుయేషన్ పెన్షన్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ, సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, ఎ.సీతారత్న పాల్గొన్నారు.

డిజిటల్ తరగతి గది ప్రారంభం

మొగల్తూరు: రూ.లక్షా 50 వేలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల్లో దాతలు సాంకేతిక సౌకర్యం కల్పించడం అభినందనీయమని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం సాయంత్రం పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి చల్లావారిమెరక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నోర్డ్ ఆంగ్లేయ ఎడ్యుకేషన్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ రూ.11.61 లక్షలతో నిర్మించిన డిజిటల్ తరగతి భవనం, క్లాస్ రూమ్లను మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజులతో కలిసి ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదివిన పూర్వవిద్యార్థి చల్లా బెనర్జీ నోర్డ్ ఇండియా సంస్థలో ఉన్నత స్థితిలో ఉద్యోగం చేస్తున్నారన్నారు. దీంతో తాను చదువుకున్న పాఠశాలలో డిజిటల్ రూమ్ ఏర్పాటుపై తాను పని చేస్తున్న కంపెనీ ప్రతినిధులను సంప్రదించి రూ.11.61లక్షలు నిధులు మంజూరు చేయించారన్నారు. ఈనిధులతో డిజిటల్ క్లాస్‌రూమ్, కావల్సిన కంప్యూటర్, ప్రింటర్, స్క్రీన్, ఇన్వెర్టలను సమకూర్చడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా స్థల దాతలు చల్లా వీర వెంకట సత్యనారాయణ, దానయ్య నాయుడు, రేణుకా శ్రీనివాస్, సంస్థ ప్రతినిధులు నున్నా సునీల్ కుమార్, వీర నరేంద్ర, కె.ఆనంద్, ఎం.సురేష్ కుమార యాదవ్‌లను గ్రామస్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి చిన్నా, టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, జనసేన అధ్యక్షుడు కొల్లాటి గోపి పాల్గొన్నారు.

నూతన సూపర్ లగ్జరీ బస్సు ప్రారంభం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ఆర్‌టిసి డిపో నుంచి హైదరాబాద్‌కు నూతన సూపర్ లగ్జరీ బస్సును శనివారం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గూడెం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడేలా ఎపిఎస్ఆర్‌టిసి నూతన సూపర్ లగ్జరీ బస్సు అందుబాటులోకి తీసుకురావడం మంచి శుభ పరిణామం అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రవాణా సంస్థగా ఆర్‌టిసికి మంచి పేరు ఉందని, ఈ సంస్థను ప్రజలందరూ ఎంతో నమ్మకంతో ఆదరించి ప్రయాణం చేస్తారని తెలిపారు. డిపో మేనేజర్ వైఎస్ఎన్.మూర్తి, చీఫ్ ఇన్‌స్పెక్టర్ సుధారాణి, ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ చోడగిరి వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటును వ్యతిరేకిస్తూ వినతి

నరసాపురం: ప్రభుత్వం ఇచ్చిన వర్క్ అడ్జెస్ట్మెంట్ గైడ్‌లైన్స్ ప్రకారం ఉమ్మడి సీనియారిటీ ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ప్రకారం ఉపాధ్యాయులని సర్దుబాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంభద్రంకు యుటిఎఫ్ పట్టణ జనరల్ సెక్రటరీ, జిల్లా కౌన్సిలర్ కె.జగ్గరాజు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి సీనియారిటీ ప్రకారం ఉపాధ్యాయుని సర్దుబాటు చేస్తే మున్సిపల్ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

ఎఐటియుసి నూతన అధ్యక్ష కార్యదర్శులుగా వీర్రాజు, హరీష్

తాడేపల్లిగూడెం: కార్మికోద్యమాన్ని పటిష్టంచేసి విస్తరింపచేయాలని ఎఐటియుసి తాడేపల్లిగూడెం ఏరియా కమిటీ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. శనివారం స్థానిక సిపాయిపేట భవననిర్మాణ కార్మికసంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా డి.సోమసుందర్, అధ్యక్షునిగా ఒవి.రాజు, ఉపాధ్యక్షులుగా పడాల శ్రీనివాస్, తాడికొండ శ్రీనివాసరావు, మేళం నాగరాజు, కార్యదర్శిగా మందలపర్తి హరీష్, సంయుక్త కార్యదర్శిగా కళింగ లక్ష్మణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.లక్ష్మీనారాయణ(కెఎల్), సహాయ కార్యదర్శులుగా తాడేపల్లి వెంకటేష్, ఆకుల కాటమరాజు, కోశాధికారిగా కొడమంచిలి చంద్రరావు ఎన్నికయ్యారు. మరో 25 మంది సభ్యులతో ఏరియా కౌన్సిల్ ఏర్పడింది.

ఆలయ నిర్మాణానికి మంత్రి నిమ్మల భూమిపూజ

పాలకొల్లు: పాలకొల్లులో శనివారం శ్రీగామాస్ వాసవీ క్లబ్ కళ్యాణ మండప ఆవరణలో జరిగిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ నిర్మాణానికి తన పూర్తి సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.